


# నేరం

-డా. వి.ఆర్.రాసాని

"ఎప్పుడూ పోలీస్‌స్టేషన్ ముఖమైనా చూడనోన్ని ఈనాటికి చూడాల్సిన ఖర్మ బట్టె" తిట్టుకుంటూనే క్రైం స్టేషన్లో అడుగుపెట్టాను.

స్టేషన్ వరండాలో రైటరు, మరో యిద్దరు కానిస్టేబుళ్ళు శవం ముందర మూగిన గుంటనక్కల్లా టేబుల్ ముందర కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు. వాళ్ళ వెనక గదిలో నల్లటి తన భారీ శరీరాన్ని ఒక చెక్క కుర్చీలో కుదించేసి చిన్నపాటి గున్న ఏనుగులా కనిపిస్తున్నాడు ఎస్సై మునస్వామి. ఆ గదికి కుడివైపుగా వున్న గదిలో సి.ఐ. నరసింహం ఎవరితోనో మాట్లాడుతున్నాడు. గేటుకు ప్రక్కగా వున్న సుంకు రేసుల చెట్టు కింద పోలీస్ జీపు ఒకటి ఊరేగింపు తర్వాత ఉత్సవ విగ్రహాలను దించేసి మూలన పెట్టిన పల్లకిలా వుంది.

"య్యోవ్. రామచంద్రా. ఏమి యీడ కనిపిస్తివి?"

ఆ జీపు ప్రక్కనుంచీ వస్తూ పలుకరించాడు ఒకప్పటి క్లాస్‌మేట్ దామోదరం. అతను ప్రస్తుతం చంద్రగిరిలో టీచర్‌గా పనిచేస్తున్నాడు.

"నువ్వేం యిక్కడ?" ఆతన్నక్కడ చూసి ఆశ్చర్యపోతూ అడిగాను.

"నా జీతం డబ్బులు పొయినయ్. కేసు పెట్నాను." విచారంగా ముఖం పెట్టి అన్నాడు దామోదరం.

"అంత అజాగ్రత్తగా ఎట్లున్నావ్?"

"వారం క్రితం స్కూల్లో జీతమిచ్చారు. దాన్ని ఒక జిగ్ బ్యాగ్‌లో పెట్టి, ఆ బ్యాగును స్కూటర్ బాక్స్‌లో పెట్టుకొని, వస్తూ వస్తూ టవున్ క్లబ్ దగ్గర ఆపి, మానసలోకి టిఫిన్ చేద్దామని బొయినా. టిఫిన్ చేసి వచ్చి చూస్తే ఏముంది. స్కూటర్ బాక్స్ తెరచుకోనుంది. అందులో బ్యాగు లేదు." అక్కడున్న వాళ్ళు వింటారేమోనని స్వరం తగ్గించి మరీ చెప్పాడు.

"బీగం వేయలేదా?" అడిగాను.

"వేసినానబ్బా. ఎవుడో కమ్మీతో తీసేసినట్టుంది. నా సంగతి సరే. నువ్వేమిక్కడ!

"ఏమని చెప్పేదిలే. నాకు ఈమద్దెన బిఎస్ఎన్ఎల్ నుంచీ ముప్పయివేలు కట్టమని సెల్‌వన్ బిల్ వచ్చింది."

"ముప్పయివేలా. అంతెందుకొచ్చింది?"

"వచ్చింది మరి."

"చెయ్యకనే యెట్లా వస్తాది?"

"అడిగాడు సామీ. నాకసలు సెల్లే లేదు. బిల్లొచ్చింది."

"ఇట్ల కూడా జరుగునా!"

"మా కాలేజీలో ఈమద్దెన కంప్యూటర్స్ కోర్సు పెట్నారు. అక్కడ లెక్చరర్‌గా రవిచంద్ర అని ఒక కాంట్రాక్ట్ లెక్చరర్ చేరినాడు. వాడు ఎట్లనో నా ల్యాండ్ ఫోన్ బిల్లు సంపాదించి, దాని మీద సెల్‌వన్ తీసుకున్నాడు."

"వాణ్ణి ఊరికే వదిలేస్తివా?"

"వదిలేయక ఏం జేసేది. ఆడికీ న్యూస్ పేపర్లో వేయించాను. కేసు పెట్నాను. అంతకంటే యింకేం జేసేది."

"అది సరే వాన్ని ఎట్ల కనిపెట్నావు?"

"బిల్లెత్తకపోయినా నేరుగా బిఎస్ఎన్ఎల్‌కు పోతే, వాళ్ళు మాకు తెలీదండ్రి. ఆ తర్వాత పోలీసు రిపోర్టిచ్చినా. పోలీసులు బిల్లులో వుండే నెంబర్‌కు ఫోన్‌జేసినారు. దొరికి పొయినాడు. అయినా ఏంలాభం. వాడిపైన ఏమీ చర్యతీసుకోవడంలా. ఊరికే తిప్పించుకుంటా వుండారు. అది సరే. నీ విషయమేమైంది."

"కేసు పెట్నాను. ఆ కేసు ఎస్సైకి ఎండార్స్‌చేసి ఈరోజు రమ్మన్నాడు సి.ఐ." అలా మాట్లాడుకుంటూ వెళ్ళి సి.ఐ.ని కలిశాం...

అరణ్య రాజ్యానికి రాజయిన సింహరాజులా చైర్‌లో దర్జాగా కూర్చొనున్నాడు సి.ఐ. నన్ను చూడగానే కూర్చోమని చెప్పి. "వాణ్ణి పిలిపించాము. రెండురోజుల్లో సెల్లు తెచ్చిస్తానన్నాడు. బిల్లు కూడా కడతానన్నాడు. మీరు వారం తర్వాత కనిపించండి. యింకా ఏమైనా అవసరమైతే యస్సైని కలవండి." అన్నాడు.

అరణ్య రాజ్యానికి రాజయిన సింహరాజులా చైర్‌లో దర్జాగా కూర్చొనున్నాడు సి.ఐ. నన్ను చూడగానే కూర్చోమని చెప్పి. "వాణ్ణి పిలిపించాము. రెండురోజుల్లో సెల్లు తెచ్చిస్తానన్నాడు. బిల్లు కూడా కడతానన్నాడు. మీరు వారం తర్వాత కనిపించండి. యింకా ఏమైనా అవసరమైతే యస్సైని కలవండి." అన్నాడు.

దాంతో ఆయన దగ్గర సెలవుతీసుకుని బయట పడ్డాం. కొంతసేపు పిచ్చాపాటీ మాట్లాడుకున్న తర్వాత దామోదరం వెళ్ళిపోయాడు. నేను నేరుగా రూంకొచ్చాను. నేను వచ్చేటప్పటికి నా రూమ్మేట్ చంద్రానాయక్ రూంలోనే వున్నాడు. ఆతనితోబాటు మరో నలభై ఏళ్ళ బక్కపల్చటి వ్యక్తి కాట్‌పైన కూర్చొనున్నాడు.

తెల్లటి చొక్కా, తెల్లటి అడ్డపంచె, భుజాన పైగుడ్డా, కాస్తా పెరిగిన

గడ్డం, చెదరిన జుట్టు. ఆ జుట్టులో ఒకటీ అరా చెల్లటి నెరసిన వెంట్రుకలు... మనిషి సన్నగా చామన ఛాయతో చూడ్డానికి రివటలా వున్నాడు.

"ఈయన మా మామ సార్."అంటూ పరిచయం చేశాడు నాయక్.

"మామంటే..." అనుమానంగా అడిగాను.

"మా అక్క భర్త సార్"అని ఆతని వైపు తిరిగి"సారూ నే ఈ రూంలో వుంటున్నాం" అంటూ చెప్పాడు!

"నమస్కారం సారు." అన్నాడతను చేతులు జోడించి.

"మనం ఒక్కసారి జువెనైల్ హోంకు పోయాము చూడండి సార్ ఒక అబ్బాయికోసం. ఆ అబ్బాయి ఈయన కొడుకే సార్." టేబుల్ పైనున్న పుస్తకాలు సర్దుతూ చెప్పాడు చంద్రానాయక్.

నేను ఆంత్రోపాలజీలో ఎం.ఏ. చేశాను. ఈమధ్యనే ఇన్ సర్వీస్ అభ్యర్థిగా పిహెచ్.డిలో చేరి రెండేళ్లయింది. మా యిల్లు టవునికి దూరంగా వుండడంవల్లనూ, ఇంట్లో చదువుకోడానికీ, రాసుకోవడానికీ సౌకర్యం లేనందువల్లనూ హాస్టల్లో దిగాను. హాస్టల్లో గదికి ఇద్దరిద్దరుండడం ఆనవాయితీ. అందువల్లా నేను రూంలో చేరిన కొత్తలో "నాకు ఈ రూంలో అటాచ్‌మెంట్ సార్. ఎం.ఏ. హిస్టరీలో చేరాను" అంటూ నా రూంలో చేరాడు చంద్రానాయక్.

చేరిన రెండురోజుల్లోనే ఆత్మీయంగా నాలో కలిసిపోయాడు. పైగా నా పరిశోధన గిరిజనుల జీవన విధానంపైన కావడంతో ఆతనితో నాకు మంచి స్నేహమే కుదిరింది. రోజూ సాయంత్రం కలిసి టవునుకు వెళ్ళేవాళ్ళం. అప్పుడప్పుడూ మానసలోనో, ఎక్కడో ఒకచోట టిఫిన్లను కూడా చేసేవాళ్ళం. సినిమాలకు కూడా వెళ్ళే వాళ్ళం. నాకు ఉద్యోగం వుంది గనక ఆతని కర్చు కూడా నేనే భరించేవాణ్ణి. అలా ఒకరోజు టవునుకొచ్చినప్పుడు "మా అక్క కొడుకు జువెనైల్ హోంలో వున్నాడు... ఒకసారి అలావెళ్ళి అలా చూసొద్దాం సార్" అంటూ ఆ హోం వున్న దక్షిణ మాడవీధికి దారితీశాడు. దారిలో నాయక్ కొన్ని చాక్‌లైట్లు, బిస్కట్లు కొనుక్కున్నాడు.

అవి ఆతనికిచ్చి హాస్టల్‌కి తిరిగొస్తుంటే" మీ అక్క కొడుకు ఏం చేసి అక్కడికి వెళ్ళాడు" అంటూ అడిగాను.

"ఏమీ చేయలేదు సార్. పల్లెల్లో ఏవో వుంటాయి కదా" అంటూ దాటవేసేశాడు. "ఇంత చిన్న పిల్లవాడు చేసే నేరాలు పల్లెల్లో మాత్రం ఏముంటాయి" అనుకుంటూ "చెప్పడం యిష్టం లేదు కాబోలు" అనుకొని ఆ తర్వాత నేనావిషయమే మరచిపోయాను.

అది గుర్తుకు వచ్చి "మీ అబ్బాయిని చూడడానికి వచ్చావా?" అంటూ ఆ వ్యక్తిని అడిగాను.

"అవున్సార్- బిడ్డె ఆడికి బొయ్యి ఆర్నెళ్ళయింది. యెట్టుండాడో ఏమోనని వస్తినారు." దీనంగా ముఖం పెట్టి మరీ చెప్పాడు.

"నేను మా మామను పంపించొస్తాన్ సార్."అంటూ వాళ్ళ మామను తీసుకుని వెళ్ళిపోయాడు చంద్రానాయక్.

దైనందిన కార్యక్రమాలతో యాంత్రికంగా కొన్ని రోజులు గడిచిపోయాయి. ఒకరోజు హడావుడిగా రూంకొచ్చాడు చంద్రానాయక్. ఆతని ముఖంలో ఏదో ఆందోళన. మాటిమాటికీ నిట్టూరుస్తున్నాడు.

ఏమైనా ఆర్థిక యిబ్బందేమో. అప్పుడప్పుడూ పదోపాతికో యిస్తూ ఆదుకుంటూనే వున్నాను. యిప్పుడే సమస్య వచ్చిందోననుకుంటూ "ఏమయ్యా నాయక్ అలా వున్నావ్?" అంటూ అడిగాను.

"మాయక్క కొడుకు జువెనైల్ హోం నుంచీ పారిపోయినాడు సార్." బాంబులా పేల్చాడు.

"ఏమైంది?" కాస్తా కంగారుగానే అడిగాను.

"అక్కడ పురుగులన్నముూ, పాచిన కూరలు పెట్నారంట సార్. వీడు ఊరికే వుండకుండా యిట్లాంటన్నం తిననని తిరగబడి నాడంట. ఆ వార్డర్లు మంచోళ్ళు గాదు సార్. పట్టుకోని చితక కొట్నారంట. ఆ దెబ్బలకు తట్టుకోలేక వెనక పక్క గోడ దూకి పారిపోయినాడంట. యెక్కడున్నాడో తెలీదు."

ఒక్క క్షణం నిర్ఘాంతపోయి "ఈ విషయం నీకెట్లా తెలుసు?" అని అడిగాను.

"అప్పుడప్పుడూ పోయి పలకరించి వస్తావుంటా కదా. ఈరోజు కూడా చూసొద్దామని పోతే, ఆతనితోబాటున్న యింకో పిల్లోడు ఈ విషయం చెప్పినాడు సార్."



"అయితే యిప్పుడేం చేయాలనుకుంటున్నావు?"

"యెట్లోవొగట్ల వాన్ని పట్టుకోని మళ్ళా వాళ్ళకు అప్పజెప్పాల."

"ఎక్కడుంటాడని వెదకతావు?"

"యింతకు ముందు కూడా ఒక్కసారి యిదే మాదిరొచ్చేసినాడు సార్. దొంగల బండెక్కి యింటికే పోయిండాడు"అంటూ అక్కడి నుంచీ తొందర తొందరగా వెళ్ళిపోయాడతను.

అలావెళ్ళిన నాయక్ ఆ మరునాడు కానీ రాలేదు.

ఆరోజు పడుకునే ముందడిగాను.

"మీ యక్క కొడుకు దొరికినాడా?"

"దొరికినాడు సార్. పాపం. ఆ జైల్లో వుండలేక ఏడుస్తాడు. ఇంక పదహైదు రోజులకు శిక్ష పూర్తవుతుంది. అంతవరకన్నా నెమ్మదిగా వుంటే చాలు" అన్నాడు నాయక్.

ఆ రోజు రాత్రి నాయక్ మేనల్లుడి గురించిన ఆలోచన్లతోనే నిద్రపోయాను.

★ ★ ★

పోలీసులు రమ్మన్న వారానికి తిరిగి వెళ్ళాను. నేను వెళ్ళేటప్పటికి ఎస్సై మునస్వామి వరండాలో రైటర్‌తో ఏదో మాట్లాడుతున్నాడు. నన్ను చూడగానే "వాడు రాలేదండి. సరయిన ఆధారాలు లేవు. యిప్పుడేమొ వాడు అది నాది కాదు. అసలు మీరు నాతో ఫోన్లో మాట్లాడనే లేదు అంటున్నాడు." కప్పను మింగిన పాములా కళ్ళు మూసుకొని నోరు చప్పరిస్తూ, మత్తుగా ఆవులించి చెప్పాడు ఎస్సై మునస్వామి.

ఆతని ధోరణి చూస్తుంటే రవిచంద్ర దగ్గర డబ్బులు మింగినట్లనిపించింది. 'ఇంక ఈ కేసు తెగేది కాదులే' అనుకుంటూనే "ఎప్పుడు కనిపించమంటారు సార్" అని అడిగాను.

"వచ్చే మంగళవారం రండి" అన్నాడు.

ఇక చేసేది లేక తిరిగొస్తుంటే అప్పుడొచ్చాడు దామోదరం. ఆతని సమస్యా యింకా తీరలేదు. సి.ఐ.ని కలిస్తే "మీరు జీతం డబ్బులు పోగొట్టుకున్నారు కాబట్టి మీకు తప్పకుండా రికవరీ చేసిస్తాం. మొన్న స్మగ్లింగ్‌లో ఓ సూట్‌కేసు దొరికింది. అయితే దొంగలు పారిపోయారు. అది కోర్టుకి సబ్‌మిట్ చేసి మీకివ్వాలి. సబ్‌మిట్ చేయాలంటే సూట్‌కేస్ లిఫ్టింగ్ కింద ఎవడి పైనో ఒకడిపైన కేసు బనాయించాలి. ఆ తర్వాత మీకివ్వాలి. వారం తర్వాత కనిపించండి." అన్నాడు.

దామోదరం కళ్ళలోకాస్తా సంతోషం కనిపించింది.

సి.ఐ.కి ఒక నమస్కారం పారేసి ఇద్దరం బయటికొచ్చాం. అలా నడుచుకుంటూ మానసకు వెళ్ళి కాఫీ తాగి రిలాక్సయ్యాం. అక్కడి నుంచీ అటే దామోదరం వెళ్ళిపోయాడు. నేను తిన్నగా లైబ్రరీకి నడిచాను.

బిఎస్ఎన్ఎల్ నుంచీ ముప్పయివేలు కట్టమని నాకు బిల్లులు వస్తూనే వున్నాయి. వాటిని చూసిన ప్రతిసారీ ఇంట్లోనుంచీ ఫోను.

పోలీసుస్టేషన్‌కి తిరిగి తిరిగి నాకు విసుగు పుడుతోంది. పది రోజుల క్రితం 'బిల్లు కట్టకపోతే మేము తీసుకొను న్యాయపరమైన చర్యలకు మీరు బాధ్యులగుదురు' అంటూ యింటికి నోటీసొచ్చింది. ఇంక ఇలా లాభం లేదనుకొని ఒక లాయర్‌కి నాలుగువందలు కొట్టి ఒక నోటీసు పంపించేశాను. అంతే. ఆ తర్వాత బిల్లులు రావడం ఆగిపోయింది.

ఈ సంఘటన జరిగిన నెల తర్వాత మళ్ళీ రూంలో చంద్రానాయక్ మామ కనిపించాడు. ఇద్దరూ హడావుడి పడుతున్నారు.

"ఏమి నాయక్. ఏమైనా ప్రాబ్లమా!" వాళ్ళ హడావుడి చూసి అడిగాను. "ఏమీ లేద్సార్." సర్దుకుంటున్నట్లన్నాడు నాయక్.

నేను తెల్లకాగితాలు తీసుకుని డిపార్ట్‌మెంట్‌కి వెళ్ళిపోయాను.

ఆ సాయంత్రం బజారుకు వెళ్ళి స్టేషనరీ కొనుక్కుని వస్తుంటే దామోదరం కనిపించాడు. నన్ను తోడుగా రమ్మంటే యిద్దరం పోలీసుస్టేషన్‌కి వెళ్ళాం.

అక్కడికి వెళ్ళగానే చంద్రానాయక్, వాళ్ళ మామ స్టేషన్లో కనిపించారు.

ఏం జరిగిందోననుకుంటూ ఒక్క క్షణం ఆందోళన పడ్డాను. సి.ఐ. నరసింహంతో వాళ్ళు ఏదో మాట్లాడుతున్నారు. మేము రైటర్ కూర్చునే ప్రదేశానికి వెళ్ళాం. కిటికీ గుండా చూస్తే వాళ్ళు కనిపిస్తున్నారు. వాళ్ళు నన్ను గమనించడం లేదు. కానీ వాళ్ళ మాటలు మాత్రం స్పష్టంగా వినిపిస్తున్నాయి.

"సార్. ఎట్లయినా సరే. మా వాణ్ణి మళ్ళీ ఆ హోంలో పడేటట్లు చూడండి సార్." చంద్రానాయక్ అభ్యర్థిస్తున్నాడు.

"యెట్లయ్యా. వాడేమో తప్పు చేయందే యెట్లా. ఇప్పటికే రెండుసార్లు ఆ పిల్లోన్ని అన్యాయంగా పంపించాను. ఇంక నావల్లా కాదు." ఖచ్చితంగా అన్నాడు సి.ఐ. నరసింహం.

"అట్లంటే ఎట్లసామే. గంపెడు సంసారం. ఈ కరువుకు వారానికొక తూరన్నా కడుపు నిండా తినలేకపోతున్నాం. వాణ్ణి లోపలికి పంపించేస్తే, వాడన్నా అంత తింటాడని మా ఆశ." చేతులు కట్టుకొని ఎంతో వినయంగా వంగి చెబుతున్నాడు నాయక్ మామ.

"ఏందయ్యా ప్రాణం తీస్తున్నారు. యింతకు ముందున్న సి.ఐ. చెప్పినాడని ఆ పని చేసినా. ఇంక వీలు పడదు." ఖరాఖండిగా అన్నాడు సి.ఐ. నరసింహం.

"ఆయన మహానుభావుడు సార్. మాకు వేరే• వాళ్ళ ద్వారా పరిచయమైనారు. పేద వాళ్ళంటే కాస్త కనికరం చూపిస్తారు. చాలా మంచివారు సార్." అన్నాడు చంద్రానాయక్.

(మిగతా 27వ పేజీలో)


# సైన్స్ క్లిప్

**-సి.వి.సర్వేశ్వర శర్మ**

## ఎవరెస్టు శిఖరం వద్ద ఎప్పుడూ మేఘం ఉంటుంది, ఎందువల్ల?

ఎవరెస్టు పర్వతం శిఖరం వద్ద కన్పించే మేఘంను ఒక తురాయిగా అభివర్ణించవచ్చు. ఇది ధారగా ప్రవహించే బలమైన గాలులవల్ల ఏర్పడుతుంది. ఈ గాలులు గంటకు 500 కిలోమీటర్ల వేగంతో బలంగా ట్రోపోస్ఫియర్ ఉపరి భాగంలో లేదా స్ట్రాటో స్ఫియర్‌లో తూర్పువైపునకు వీస్తూ ఉంటాయి.

భూతలానికి పది నుండి పదిహేను కిలోమీటర్ల ఎత్తులో ఈ గాలులు వీస్తూ ఉంటాయి. ప్రపంచంలో చాలా పర్వతాల ఎత్తు ఎనిమిది కిలోమీటర్లు లోపులో ఉంటాయి. అంటే ఈ పర్వతాల శిఖరాలు బలంగా ఎత్తులో ప్రవహించే గాలులకు బాగా దిగువన ఉంటాయి.



ఎవరెస్టు శిఖరం భూమి నుండి 8,848 మీటర్ల ఎత్తులో ఉంటుంది. శీతాకాలంలో వీచే బలమైన గాలులు ఈ పర్వతం శిఖరం మీదుగా దూసుకువెడతాయి. దక్షిణ వైపు ఏటవాలు తలం నుండి ఈ గాలులు తేమను లాగుతాయి.

ఇంత ఎత్తులో ఉండే చల్లదనం వల్ల ఈ తేమ మంచు బిందువులుగా ఘనీభవనం చెంది గాలిలో పెద్ద మేఘంగా దర్శనం ఇస్తుంది.

పర్వతాల తలంపై అనేక ఆకుపచ్చని చెట్లు వున్నప్పటికిని దూరంనుండి పర్వతాలను చూస్తే నీలంగా కన్పిస్తాయి. ఎందుకు ఇలా కన్పిస్తాయని మనకు సందేహం కల్గుతూ వుంటుంది.

పర్వతాలు నీలంగా కన్పించడానికి కారణం సూర్యకాంతి ఇచట పరిక్షేపణం చెందడం. పర్వత ఉపరితల ప్రాంతంలో దుమ్ము, పొగ, బూడిద వంటి వాటి సూక్ష్మకణాలు ఎగురుతూ ఉంటాయి.

సూర్యకాంతిలోని ఏడు రంగులు (తెల్లని కాంతిలో ఉండేవి) ఈ కణాలను ఢీకొని వేరువేరు విధాలుగా పరిక్షేపణం చెందుతాయి. తేలికగా ఉండే నీలి, ఊదా రంగు ఫోటాన్లు హెచ్చు శక్తి కల్గి ఉండడంవల్ల ఎక్కువ దూరం పరిక్షేపణం చెందుతాయి.

తక్కువ శక్తి ఉండే ఆకుపచ్చ, ఎరుపు, నారింజ రంగు ఫోటాన్లు అంత ఎక్కువ దూరం పరిక్షేపణం చెందలేవు. ఊదా, నీలి రంగు ఫోటాన్లు ఎక్కువ దూరం పరిక్షేపణం చెందగల్గడం వల్లనే పర్వతాల తలాలు దూరం నుండి చూస్తే నీలంగా కన్పిస్తాయి. ఆకాశం కూడా ఇదే కారణంగా నీలంగా కన్పిస్తుంది.

పర్వతాలు లేదా కొండల పైకి మార్గం కొండ చుట్టూ రోడ్డు తిరుగుతూ చివరకు కొండ పైభాగానికి వెడుతుంది. నిటారుగా పైకి రోడ్డు వేయరు. రోడ్డు వాలుగా వేయడంవల్ల ఒక బరువును పైకి తీసుకువెళ్లేందుకు ఎక్కువ శ్రమపడాల్సిన అవసరం ఉండదు.

కొండపైకి వెళ్లే మార్గాన్ని అనేక వాలు రోడ్లుగా నిర్మించి వీటిని యు-మలుపులుతో కలుపుతారు. కొద్ది కొద్ది ఎత్తు పైకి వెళ్లడానికి పెద్ద పెద్ద వాలు రోడ్లు నిర్మిస్తారు. ఈ రోడ్ల వెంబడి వాహనం కదిలేటప్పుడు దాని ఇంజన్‌పై ఒత్తిడి ఎక్కువగా ఉండదు. వాలు తక్కువయితే ఇంజన్ పై ఒత్తిడి ఎక్కువ అవుతుంది. అందుకే కొండపైకి రోడ్లు కొండ చుట్టూ, తిప్పుతూ వేస్తారు. ★

**ఎవరెస్టు శిఖరం భూమినుండి 8,848 మీటర్ల ఎత్తులో ఉంటుంది. శీతాకాలంలో వీచే బలమైన గాలులు ఈ పర్వతం శిఖరం మీదుగా దూసుకువెడతాయి. దక్షిణ వైపు ఏటవాలు తలం నుండి ఈ గాలులు తేమను లాగుతాయి. ఇంత ఎత్తులో ఉండే చల్లదనం వల్ల ఈ తేమ మంచు బిందువులుగా ఘనీభవనం చెంది గాలిలో పెద్ద మేఘంగా దర్శనం ఇస్తుంది.**

---

*(9వ పేజీ తరువాయి)*

"ఏమయ్యా. నువ్వు చదువుకున్నావే. ఇది న్యాయమంటావా?" అడిగాడు నరసింహం.

"ఏంజేసేది సార్. నిజం చెప్పాలంటే... మాయమ్మా నాయనకు, ట్యూషన్లు చెప్పి డబ్బు పంపిస్తున్నాను. నాకు స్కాలర్‌షిప్ వస్తోంది కాబట్టి చదువుకోగలుగుతున్నాను. లేకుంటే నా పరిస్థితి కూడా అంతే సార్. ఇంచుమించు మా వూర్లో అందరి పరిస్థితీ అదే సార్."

దీనంగా చెబుతున్నాడు చంద్రానాయక్.

వాళ్ళ మాటలు విని ఒక్క క్షణం షాక్ తిన్నాను.

"స్టైయిలు, డ్రస్సూ చూసి ఫరవాలేదనుకున్నాను, కానీ మరీ యింత దారిద్ర్యంలో వున్నాడనుకోలేదు." చంద్రానాయక్‌ని చూస్తూ అనుకున్నాను.

వాళ్ళ పరిస్థితిని విన్న తర్వాత సి.ఐ. నరసింహం గుండె కాస్తా కరిగినట్టుంది, అందుకే "ఈసారికి యేదో ఒకటి చేసి పంపేస్తాను. ఆ తర్వాత నా దగ్గరికి రాకండి" కాస్తా మెత్తబడుతూ అన్నాడు.

"పిల్లోన్ని ఎప్పుడు తీసకరమ్మంటారు సార్." అడిగాడు చంద్రానాయక్.

"రేపు తీసకరండి. ఏదో మేనేజ్ చేసి పంపించేస్తాను."

"సరే సార్."అంటూ గది వెలుపలికొచ్చారిద్దరూ.

వాళ్ళ ముఖాలలో ఏదో జయించినంత ఆనందం.

అక్కడ నన్ను చూడగానే ఒక్క క్షణం కలవరపడి మళ్ళీ సర్దుకొని "ఏమిటి సార్. ఇక్కడున్నారు" అన్నాడు.

"ఊరికేనేలే." అన్నాను అంతకుమించి ఏ మూలో తెలీక,

"వస్తాన్ సార్" అంటూ అక్కడి నుంచీ వాళ్ళ మామను తీసుకుని గబగబా వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత మేం పోయాం లోపలికి.

"ఏమయ్యా దామోదరం. రికవరీ చేసిచ్చేస్తాం. రెండురోజుల తర్వాత కనిపించు."అన్నాడు సి.ఐ. నరసింహం.

దామోదరం ముఖం సంతోషంలో వెలిగిపోయింది.

నా మనసు మాత్రం ఆందోళనతో చిదిమిన టమోటాలా అయింది.

ఇద్దరం బయటికొచ్చాం.

"దామూ. ఈసారికి నీ జీతం డబ్బులు నీకు తప్పకుండా వచ్చేస్తాయిలే" అన్నాను.

"ఎలా వస్తాయి. ఎవడైనా దొంగ దొరకాలిగదా." అన్నాడు దామోదరం.

"ఆల్ రెడీ, వాళ్ళకొక దొంగ యిప్పుడే దొరికాడు" అన్నాను.

"నీకెలా తెలుసు?" ఆతృతగా అడిగాడు దామోదరం.

"వాళ్ళకొక బాల నేరస్తుడు దొరికాడు. వాడెవడో నాకు తెలుసు" అంటూ వికలమైన మనసుతో హాస్టల్ వైపునకు నడవసాగాను. ★